క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచాలి



సూచనలు చేస్తున్న డీఎల్‌పీవో

మంథనిరూరల్: వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా ప్రజల్లో అవగాహన పెంచాలని డివిజనల్ పంచాయతీ అధికారి కొమ్మెర సతీశ్‌కుమార్ ఆదేశించారు. మంథని మండలం అడవిసోమన్‌పల్లిలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, నిరంతరం పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం తడి, పొడి చెత్త సేకరణ, సెగ్రిగేషన్ షెడ్డు, వైకుంఠధామం, పల్లె దవఖానా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఎంపీవో శేషయ్య సూరి, కార్యదర్శి నడిపెల్లి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

జూలపల్లి: మండల కేంద్రంలో స్వచ్ఛ శుక్రవారంలో భాగంగా మండల పంచాయతీ అధికారి అనిల్‌రెడ్డి పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బీసీకాలనీ వరకు ఉన్న పిచ్చిమొక్కల తొలగింపుతోపాటు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కార్యదర్శి ముజీబ్, కారోబార్ పురుషోత్తం పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దూరం

కాల్వశ్రీరాంపూర్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు దరిచేరవని, ప్రజలందరూ పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో పూర్ణచందర్‌రావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం డ్రైడే సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి కుళాయిలపై మూతలు పెట్టాలని, అవసరం లేని పాత్రలు బోర్లించి పెట్టాలని, కొబ్బరి బోండాలు, పగిలిపోయిన కుండలు, నీటి గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

ఎలిగేడులో స్వచ్ఛ శుక్రవారం

ఎలిగేడు: మండలంలోని గ్రామాల్లో అధికారులు శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఇంటింటా తిరుగుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో కిరణ్, కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన చేపపిల్లలు పంపిణీ చేయండి

మంథని: ప్రభుత్వం ద్వారా పంపిణీ చేసే ఉచిత చేపపిల్లలు నాణ్యమైనవి అందించాలని రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్లు కోరారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఫిషరీస్ కార్యాలయంలో శుక్రవారం చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. జిల్లా డైరెక్టర్లు పోతరవేని క్రాంతికుమార్, అయిలవేని వీరాస్వామి, పెద్దపల్లి సుజాత, చిట్ల శ్రీనివాస్, తాళ్ల తిరుపతి, రేళ్ల కోటయ్య, బోయిరి శ్రీకాంత్, పాలవేన మొండయ్య, మాజీ వైస్ ఎంపీపీ పిట్టల రవికుమార్ ఉన్నారు.

రోడ్లను శుభ్రం చేయాలి



రహదారిని శుభ్రం చేస్తున్న కార్మికులు

సుల్తానాబాద్: వర్షాలకు రోడ్డుపైకి వచ్చిన చెత్త, ఇసుకతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ రమేశ్ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని 14వ, 15వ వార్డుల్లోని రోడ్డును శుక్రవారం మున్సిపల్ కార్మికులతో శుభ్రం చేయించారు. కాలనీల్లో నిలిచిన నీటిని తొలగించాలని సూచించారు.

మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన

పాలకుర్తి: పాలకుర్తి, ఈసాలతక్కళ్లపల్లి గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బసంత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై స్వామి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా షీ టీం ప్రాముఖ్యత, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పోలీస్ సిబ్బంది సురేశ్, యేసుమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా వాకింగ్ ట్రాక్

- పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయిన వైనం



పిచ్చిమొక్కలతో నిండిన వాకింగ్ ట్రాక్

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా పోతనకాలనీలో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. సింగరేణి కార్మిక కుటుంబాల ఆరోగ్యం కోసం సింగరేణి యజమాన్యం పోతన కాలనీలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసింది. వర్షాకాలం కావడంతో వాకింగ్ ట్రాక్ లోపల మొత్తం చెట్లు, పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండి ఉంది. అక్కడికి పందులు సైతం చేరడంతో దుర్వాసన వస్తోందని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాకింగ్ కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో వచ్చే వాకర్స్ భయభ్రాంతులకు గురవుతున్నామని చెప్తున్నారు. వాకింగ్ ట్రాక్‌లో పెద్ద కంకర కాకుండా చిన్న, చిన్న చిప్స్ వంటి కంకర పోయాలని కోరుతున్నారు. వీధి దీపాలు సైతం సరిగా లేకపోవడంతో పాములు, విష పురుగులు సైతం వచ్చే అవకాశం ఉందని వాపోతున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను కార్మికులకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. వాకింగ్ ట్రాక్ లోపల ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో పాటు చిన్నారుల కోసం లోపల పార్క్ ఏర్పాటు చేసేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని పోతనకాలనీ వాసులు కోరుతున్నారు.

సింగరేణి యాజమాన్యం స్పందించాలి



సింగరేణి కార్మిక కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ చుట్టూ, లోపల పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో దోమలు, పాములు, విష పురుగులకు నివాసంగా మారింది. సింగరేణి యజమాన్యం స్పందించి వెంటనే పిచ్చిమొక్కలు తొలగించాలి.

– ఎం.అంజలి, పోతనకాలనీ

వాకింగ్ చేయడం ఇబ్బందిగా ఉంది



సింగరేణి ఆధ్వర్యంలో కార్మికుల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ చుట్టూ సరిగా విద్యుత్ దీపాలు లేకపోవడంతో తెల్లవారుజామున, సాయంత్రం, రాత్రివేళల్లో వాకింగ్ చేయడం ఇబ్బందిగా ఉంది. వెంటనే వీధిదీపాలు ఏర్పాటు చేయాలి.

– జి.సంపత్‌కుమార్, సింగరేణి కార్మికుడు, పోతనకాలనీ

దోమల నిర్మూలనకు సహకరించండి



ఆయిల్‌బాల్స్ వేస్తున్న సిబ్బంది

కోల్‌సిటీ: దోమల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి కోరారు. 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. స్థానిక సంజయ్‌గాంధీ నగర్‌లో డిప్యూటీ కమిషనర్ పరిశీలించారు. స్థానికులకు దోమల నివారణపై డిప్యూటీ కమిషనర్ అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న మంచినీళ్లలో కూడా దోమల లార్వా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. పూల కుండీలు, ఎయిర్ కూలర్లు, గోళాలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పల్లో నిల్వ ఉన్న నీటిని మున్సిపల్ సిబ్బంది తొలగించారు. మురుగు నీటి కుంటల్లో ఆయిల్‌బాల్స్ వేశారు. స్థానిక గాంధీనగర్‌లోని సింగరేణి పాఠశాల సమీపంలో ఉన్న మురుగు దొడ్డి ఆవరణను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, వార్డు అధికారులు, శానిటరీ జవాన్లు, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల దినోత్సవం



ఎలిగేడు: వేడుకల్లో ఆటోడ్రైవర్లు

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో శుక్రవారం ఆటోడ్రైవర్ల దినోత్సవం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ ఎదుట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) సీఐ ఎం.లింగమయ్యతో కేక్ కట్ చేయించారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు రహీం, ఆటోడ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

ఎలిగేడు: ప్రపంచ ఆటోడ్రైవర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు కవ్వంపల్లి శ్రీనివాస్(బంగ్లా), మాజీ వార్డు సభ్యులు మామిడాల రమేశ్, తాటిపల్లి సతీశ్ బాబు, కోడూరి శ్రీనివాస్, ఆటోడ్రైవర్లు ఎండీ.చాంద్‌పాషా, కోట రమేశ్, శ్యాంసుందర్, ప్రతాప్, లింగయ్య, శ్రీనివాస్, మండిగ శ్రీధర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు స్వశక్తి రుణాలు**

కాల్వశ్రీరాంపూర్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, లబ్ధిదారులకు స్వశక్తి సంఘాల ద్వారా రూ.లక్ష రుణాలుగా ఇచ్చే సదుపాయం ప్రభుత్వం కల్పించిందని ఎంపీడీవో పూర్ణచందర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని కూనారంలో శుక్రవారం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల సమీక్ష సమావేశం నిర్వహించారు.

- **ఆర్‌ఎంపీ మండల అధ్యక్షుడిగా జగదీశ్వర్**

రామగిరి: ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాగేపల్లిలోని ఆర్‌ఎంపీ భవనంలో డివిజన్ అధ్యక్షుడు కేవీ చారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బొద్దుల జగదీశ్వర్, జనరల్ సెక్రటరీగా గండి పైడయ్య, కోశాధికారిగా నాంసాని సందీప్, ఉపాధ్యక్షుడిగా సుంకె ప్రవీణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

- **పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు**

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం నగరపాలక ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీ ఆదేశాలతో కార్పొరేషన్ 21వ డివిజన్ లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 100రోజుల ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం మందులు పంపిణీ చేశారు. ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగు నాగభూషణం, శానిటరీ సూపర్‌వైజర్ ఆడెపు శ్రీనివాస్, యూసుఫ్ పాల్గొన్నారు.

- **విద్యార్థులకు అవగాహన**

గోదావరిఖనిటౌన్: రమేశ్‌నగర్‌లోని ఉషోదయ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం షీటీం ఇన్‌చార్జి ఎస్‌ఐ లావణ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. షీటీం సభ్యురాలు స్నేహలత మాట్లాడుతూ వేధింపులకు గురైతే 6303923700 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. షీటీం సభ్యులు మౌనిక, సురేశ్, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

- **ఆదర్శలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ**

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లోని ఆదర్శ విద్యాలయంలో మిగిలిన సీట్లకు ప్రవేశాలు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షాదుల్ తెలిపారు. దరఖాస్తుతో నేరుగా విద్యాలయంలో సంప్రదించాలని సూచించారు. 6వ తరగతిలో 80 సీట్లు, 7లో 81, 9లో 30, 10వ తరగతిలో 38 సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

- **బాక్సింగ్ పోటీల్లో ట్రినిటి విద్యార్థుల ప్రతిభ**

పెద్దపల్లిరూరల్: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పెద్దపల్లి ట్రినిటి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు రుక్షిత్, సాహిల్, రేవంత్‌ను మున్సిపల్ మాజీ చైర్మన్ మమతారెడ్డి అభినందించారు.

- **టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్**

కోల్‌సిటీ/గోదావరిఖనిటౌన్: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెడ్డి రాజ్‌కుమార్ ఎన్నికయ్యాడు. గోదావరిఖనిలోని అడ్డగుంటపల్లిలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో మెకానిక్‌లు ఆయనను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో సీనియర్ మెకానిక్‌లు గణేశ్, శివ, సమ్మిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

- **ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో కేంద్రం వాటా తేల్చాలి**

ఓదెల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో కేంద్ర ప్రభుత్వం వాటా తేల్చాలని ఓదెల తహసీల్దార్ ధీరజ్‌కుమార్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు కారెంగల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేద కుటుంబాలకు ఇళ్లు కావాలని ఆవాస్ యోజన పథకం ఏర్పాటు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు పేరు తొలగించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేరు పెట్టాలని కోరారు. పార్టీ నాయకులు మెరుగు సారంగం, రామినేని రాజేంద్రప్రసాద్, పోలోజు శ్రీహరి, కొత్తిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అశోక్ ఉన్నారు.

- **రాష్ట్ర ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శికి సన్మానం**

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి తిరుపతిని హైదరాబాద్ సచివాలయంలో సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కలిశారు. శుక్రవారం ఆయనను కలిసి సన్మానించారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్ కార్యదర్శి తిరుపతి, ప్రకాశ్‌రావు, దేవేందర్ ఉన్నారు.

- **వివాదాస్పదంగా మారిన ఉచిత కంటి వైద్యశిబిరం**

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్‌లో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం వివాదాస్పదంగా మారింది. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన కంఠేశ్వర్ ఐకేర్ అండ్ ఆప్టికల్స్ ఆసుపత్రి పేరుతో గ్రామంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రం భవనంలో శిబిరం ఏర్పాటు చేయడంతో స్థానికులు అభ్యంతరం తెలిపారు. అయితే అప్పటికే కంటి పరీక్షలు నిర్వహించిన నిర్వాహకులు బాధితులకు అద్దాలు పంపిణీ చేస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.500 నుంచి రూ.1000 వరకు వసూలు చేశారు. దీంతో స్థానికులు నిర్వాహకులను నిలదీసి స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు సాయిసూర్యతో పాటు పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న వారు అనుమతి లేకుండా ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రంలో క్యాంపు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించడంతో క్యాంపు ఎత్తేశారు. అనంతరం బసంత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు నిర్వాహకులను అదుపులోకి తీసుకుని విచారణ నిర్వహించారు.

గ్రాట్యుటీ క్లెయిమ్స్ త్వరగా పూర్తి చేసుకోండి

గోదావరిఖని: ఉద్యోగ విరమణ పొంది, పలు కారణాలతో గ్రాట్యుటీ నిలిచిపోయిన రిటైర్డ్ ఉద్యోగులు త్వరగా క్లెయిమ్స్ పూర్తి చేసుకోవాలని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య సూచించారు. ఆర్జీ–2 ఏరియాలో 130మంది మాజీ ఉద్యోగులు క్లెయిమ్స్ పూర్తి చేసుకోకుండా క్వార్టర్ ఖాళీ చేయడం లేదన్నారు. 26 మంది ఎలాంటి సమాచారం లేకుండా గ్రాట్యుటీ డబ్బులు తీసుకోకుండా ఉన్నారని, రిటైర్డ్ కార్మికులు సమస్య ఉంటే త్వరగా పరిష్కరించుకొని గ్రాట్యుటీ డబ్బులు తీసుకోవాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి

రామగిరి: గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో 3న నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ఆర్జీ–3, ఏపీఏ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–3 పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం తెలిపారు. సీఎండీ బలరాం నాయక్ ఆదేశాల మేరకు కేర్ ఆసుపత్రి హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో కార్డియాలజిస్ట్, న్యూరోలాజిస్ట్, మెడికల్ గ్యాస్ట్రోలాజిస్ట్, యురోలాజిస్ట్ రానున్నారని పేర్కొన్నారు. ఆసక్తి గల సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు రిజిస్ట్రేషన్ కోసం మెడికల్ కార్డులతో గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో సంప్రదించాలని సూచించారు.

7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు

పెద్దపల్లిరూరల్: తల్లిపాల విశిష్టతపై ఈ నెల 7 వరకు బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పిల్లల వైద్యనిపుణురాలు డాక్టర్ సంధ్య తెలిపారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలోనామె మాట్లాడారు. పుట్టినబిడ్డకు తల్లిపాలు తాగిస్తే అనేక సమస్యలు దూరమవుతాయన్నారు.

5న ఓదెలలో దివ్యాంగుల సదస్సు

ఓదెల: ఓదెలలో 5న దివ్యాంగ హక్కుల సాధన కోసం పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సదస్సు జరుగుతుందని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి రాసపల్లి రవికుమార్ తెలిపారు. మండలంలోని కొలనూర్‌లో శుక్రవారం సమావేశం జరిగింది. సమావేశానికి మండలంలోని 22 గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు దొడ్డె రత్నాకర్, రాజయ్య, పల్లె సుమన్, సతీశ్, సాత్తూరి అనిల్, నరేశ్, దికొండ సంజీవ్, క్యాదాసి రత్నం, గాజుల అరుణ్ ఉన్నారు.

రామగుండంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలి

రామగుండం: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్‌ను సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో శుక్రవారం డీఆర్‌యూసీసీ సభ్యుడు అనుమాస శ్రీనివాస్ కలిసి పలు విషయాలపై వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా రామగుండంలో నవజీవన్, తమిళనాడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని కోరారు. అనంతరం సీపీఆర్వోను సత్కరించారు.

డివిజన్‌లో సమస్యలపై కమిషనర్‌కు వినతి

రామగుండం: పట్టణంలోని 27వ డివిజన్ (పాత 21వ డివిజన్) పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీకి డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ ప్రతినిధి సలీంబేగ్ వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని పలు నివాస గృహాలపై ఉన్న 11కేవీ విద్యుత్ తీగలు మళ్లించి నూతన విద్యుత్ స్తంభాలు వేసినా ఇంకా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదని తెలిపారు. జేసీబీతో నాలా క్లీన్ చేయిస్తుండగా మిషన్ భగీరథ పైపులైన్‌కు జేసీబీ తగలడంతో పైపులైన్ పగిలి విద్యుత్‌నగర్‌కు భగీరథ నీటి సరఫరా నిలిచిపోయిందని, డివిజన్‌లోని పలు చోట్ల ఉన్న నాలాలలో పూడిక నిండిపోయి చిన్నపాటి వర్షానికే సమీపంలోని నివాస గృహాలలో వర్షపు నీరు నిలుస్తోందన్నారు. మరో వారంపాటు జేసీబీతో ఇదే డివిజన్‌లో సేవలు కొనసాగించాలని కోరారు. డివిజన్‌లో కోతుల బెడద తీవ్రమైందని, వాటి నుంచి విముక్తి కలిగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.



కమాన్‌పూర్: మండలంలోని గుండారం అంబేడ్కర్ విగ్రహం సమీపంలో మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి పక్కన తవ్విన పైపులైన్ గుంతను గ్రామపంచాయతీ సిబ్బంది ట్రాక్టర్‌తో పూడ్చివేయించారు. సాక్షి దినపత్రిలో రెండు రోజుల క్రితం పైపులైన్ గుంతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కథనం ప్రచురితం కావడంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ గుంతను పూడ్చివేయించారు. సమస్యను పరిష్కరించిన 'సాక్షి'కి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

ఆర్జీ–1 ఏరియాలో 104శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలో జూలైలో 104శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం లలిత్ కుమార్ తెలిపారు. జీఎం కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాలో ఈనెలలో 3.20లక్షల టన్నుల లక్ష్యానికిగాను 3.33లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి, లక్ష్యాలకు మించి 104శాతం ఉత్పత్తి చేసినట్లు పేర్కొన్నారు. జీడీకే–5 ఓసీపీలో అత్యధికంగా 124శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఆయన వివరించారు. ఉత్పత్తిలో ఓసీపీ అగ్రస్థానంలో నిలవగా, జీడీకే–2, 2ఏ గని చివరి స్థానంలో నిలిచిందన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 15.14 లక్షల టన్నుల లక్ష్యానికిగాను 12.60లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యాలకు 83శాతంలో నిలిచినట్లు తెలిపారు. సమావేశంలో పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఎస్‌వోటూ జీఎం ఆంజనేయప్రసాద్, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, వర్క్‌షాప్ డీజీఎం జితేందర్‌సింగ్, అధికారులు ధనలక్ష్మీబాయి, వీరారెడ్డి, వేణు, శ్రావణ్‌కుమార్, ఫిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆర్జీ–3లో 73శాతం బొగ్గు ఉత్పత్తి

రామగిరి: జూలైలో ఆర్జీ–3లో 73శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు గురువారం జీఎం నరేంద్ర సుధాకర్‌రావు తెలిపారు. ఆర్జీ–3లో నిర్దేశించిన 4.40 లక్షల టన్నులకు గాను 3.22 లక్షల టన్నులు అనగా 73శాతం బొగ్గు ఉత్పత్తి, నిర్దేశించిన ఓబీ మట్టి వెలికితీత 9.50లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 13.07లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 138శాతం మట్టి వెలికితీయడం, 4.79 లక్షల టన్నుల బొగ్గురవాణా చేసినట్లు పేర్కొన్నారు. గనుల వారీగా ఓసీపీ–1 గనికి నిర్దేశించిన 2.40 లక్షల టన్నుల లక్ష్యానికి 1.85లక్షల టన్నులు అనగా 77శాతం, ఓసీపీ–2 గనికి నిర్దేశించిన 2.00 లక్షల టన్నుల లక్ష్యానికి 1.37 లక్షల టన్నులు అనగా 69శాతం బొగ్గు ఉత్పత్తి చేసినట్లు వివరించారు.

ఏపీఏ గనిలో..

ఏపీఏ గనిలో జూలైలో 10శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం కొలిపాక నాగేశ్వరరావు తెలిపారు. జూలైలో నిర్దేశించిన 1.35 లక్షల టన్నులకు 0.13 లక్షల టన్నులు అనగా 10శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు పేర్కొన్నారు. 0.03 టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు వివరించారు. సింగరేణి సంస్థలో బదిలీవర్కర్లుగా ఉద్యోగంలో చేరుతున్న వారు అధికారులు, సూపర్‌వైజర్ల సలహాలు, సూచనలు పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు.

అలవెన్స్‌లపై ఆదాయపన్ను మినహాయించాలి



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని: సింగరేణి కార్మికుల అలవెన్స్‌లపై ఆదాయపన్ను మినహాయించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. జీడీకే–5వ గనిపై శుక్రవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కోల్ ఇండియా మాదిరిగా సింగరేణి కార్మికులకు అలవెన్స్‌లపై ఆదాయ పన్ను రియింబర్స్‌మెంటు చెల్లించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త ఆందోళనలు, ఉద్యమ కార్యక్రమాల్లో భాగంగా జూలై 23 నుంచి సెప్టెంబర్ 17 వరకు బొగ్గు సంస్థల పరిరక్షణ, కార్మికుల హక్కుల సంరక్షణ కోసం ఆందోళన కార్యక్రమాల్లో సింగరేణి కార్మికులు భాగస్వాములు కావాలన్నారు. పనిస్థలాల్లో పూర్తి రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వై.సారంగపాణి, కర్రావుల మహేశ్, మాదాసి రవీందర్, ఆకుల హరిణ్, పోరండ్ల వెంకటేశం, మేడ రామ్మూర్తి, నీలం శ్రీనివాస్, అట్ల వెంకటరెడ్డి, సల్వాజీ మనోహర్‌రావు, ఎల్లావుల కోటయ్య, ఆకుల వీరేశం, నరెడ్ల వెంకటేశ్వర్లు, సట్టు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్యూబాపై అమెరికా ఆంక్షలు వ్యతిరేకించాలి



గోదావరిఖని: మాట్లాడుతున్న కుమారస్వామి

గోదావరిఖని: క్యూబా ప్రజలపై అమెరికా ఆంక్షలను వ్యతిరేకించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల కుమారస్వామి అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం రామగుండం కార్పొరేషన్ ఏరియా ప్లంబర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ అనుబంధ యునియన్లలో ఆగస్టు 1 నుంచి 10వరకు సంఘీభావ నిధి వసూలు చేయాలని పిలుపునిచ్చిందన్నారు. అనంతరం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులు సరిగొమ్ముల మధు, వంగ అంజయ్య, కోశాధికారిగా అన్నం కుమార్, ఉపాధ్యక్షులుగా తోట రాజబాబు, బద్రి శంకర్, సహాయ కార్యదర్శులుగా మేరుగు రమేశ్, మద్దెల కొమురయ్య, ప్రచార కార్యదర్శిగా డి.ప్రకాశ్, కమిటీ సభ్యులుగా 11 మందితో కమిటీని ప్రకటించారు.

క్యూబా ప్రజలకు అండగా ఉందాం

రామగుండం: అమెరికా నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడుతున్న క్యూబా ప్రజలకు అండగా ఉండాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. ఆగస్టు 2 నుంచి 10వ తేదీ వరకు క్యూబా సంఘీభావ నిధి వసూలు చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు సంఘీభావ నిధి కరపత్రాలను పట్టణ కార్యాలయంలో ఆవిష్కరించారు. సీఐటీయూ ప్రతినిధులు రామాచారి, భిక్షపతి, కనకయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, వేణు, రాజు ఉన్నారు.